సాక్షి చిత్తూరు

బుధవారం । 11 । జూన్ । 2025



'అయ్యో'ర్ల పడిగాపులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు రాత్రి వరకు పడిగాపులు పడ్డారు. - 8లో



గుజ్జు పరిశ్రమల పరిశీలన

గుజ్జు పరిశ్రమలకు మామిడిని తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



కల్లూరులో ఏనుగుల మంద

కల్లూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు మూడు రోజులుగా తిష్ట వేశాయని భయాందోళన చెందారు. - 8లో

అతివలపై ఆగని అకృత్యాలు



కూటమి ఏడాది పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఆందోళనకు దిగారు. అకృత్యాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని ఎంతో మంది చిన్నారులు బలి అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మృగాళ్లను శిక్షించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మహిళా నేతలు మండిపడ్డారు. అన్యాయాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి గొంతునొక్కుతోందని నిరసన తెలిపారు.

- కూటమి పాలనలో పెరిగిన లైంగిక దాడులు, దౌర్జన్యాలు
- చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలం
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన
- మహిళల రక్షణపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం
- ధర్నా చేపట్టిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మహిళ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : ఏడాది బాబు పాలనలో మహిళల మీద దౌర్జన్యాలు, లైంగికదాడులు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో చిత్తూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిన్న పిల్లలపై అకృత్యాలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలో పోలీసుశాఖ విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి రెడ్‌బుక్ పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎంతసేపు డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే కానీ ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరళమేరి, జీడీ నెల్లూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధికరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు లీనారెడ్డి, ప్రతిమారెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, శోభ, పుష్పలత, రేఖ, పూంగొడి, మణి, శశికళ, భారతి, హరిషారెడ్డి, బిందు, శాంతి, కవిత, శ్యామల పాల్గొన్నారు.

చర్యలేవీ



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలకు ఎటువంటి మేలు జరగలేదు. రాష్ట్రంలో అత్యాచారాలు పెరుగుతున్నా చర్యలు ఎక్కడ. అన్నమయ్య జిల్లాలో బాలికపై అకృత్యాలు జరిగినా నిందితులను అరెస్టు చేయ లేదు. బాధితుల తరఫున ఫిర్యాదు అందినా చర్యలు శూన్యం. కూటమి నాయకులు అయితే ప్రభుత్వం కాపాడుతోంది.

– గాయత్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం

బాబుపై నమ్మకం లేదు



చంద్రబాబు ఏడాది పాలనలో మహిలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదు. అందుకే అంబేడ్కర్ విగ్రహానికి వినతి ఇవ్వడానికి వచ్చాం. రెడ్‌బుక్‌పాలనపై ఉండే శ్రద్ధ మహిళలకు న్యాయం చేయడంలో లేదా? పథకాలు అమలు మరిచిపోయారు. మహిళపై దాడులు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తున్నారు.

– అంజలిరెడ్డి, మహిళ విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షురాలు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



జగనన్న, ఆయన కుటుంబ సభ్యులను తిట్టడానికి మంత్రులకు సమయం ఉంటుంది. కానీ ఆడవారికి అన్యాయం జరిగితే న్యాయం చేయడానికి చిత్తశుద్ధి లేదు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా బాధితులను హోంమంత్రి ఎందుకు కలిసి భరోసా ఇవ్వలేకపోతున్నారు. రాజకీయ లబ్ధి కోసం కూటమి నాయకులు నీచంగా వ్యవహరిస్తున్నారు.

– దాక్షాయణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం

ప్రభుత్వానికి సిగ్గుచేటు



తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సంఘటనకు చలించిన జగనన్న ఏపీలో దిశ చట్టం ప్రవేశపెట్టారు. అందులో భాగంగా వేల మంది మహిళలు యాప్‌ను ఉప యోగించడంతో ఆపద సమయంలో పోలీసులు కాపాడారు. అది మహిళల రక్షణపై గత ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. కూటమి పాలనలో మాజీ సీఎం భార్యపై అసభ్యకరంగా దూషణలు చేయిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు.

– లలితకుమారి, మాజీ ఎమ్మెల్యే పూతలపట్టు నియోజకవర్గం

మహిళలపై దాడులు పెరుగుతున్నాయి



ఏడాది కాలంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా అత్యాచారాలు పెరుగుతున్నా హోంమంత్రి ఏమి చేస్తున్నారో తెలియడం లేదు. అన్యాయం జరిగిందని పోలీసు స్టేషన్‌కు వెళ్తే అక్కడ పంచాయతీలు చేసి పంపుతున్నారు. జగనన్న పాలనలో ఇలాంటివి జరగలేదు. ఇప్పుడు రాక్షస పాలనను కూటమి నాయకులు గుర్తు చేస్తున్నారు.

– హరిణిరెడ్డి, మున్సిపల్ విభాగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా సాధికారత ఎక్కడ



అంబేడ్కర్ ప్రవేశపెట్టిన మహిళా సాధికారతను వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేశారు. పథకాలకు మహిళల పేరు పెట్టి వారి ఖాతాలకు నగదు వేసి సంక్షేమ పాలన అందించారు. రాజకీయంగా వారికి సముచిత స్థానం కల్పించారు. కూటమి పాలనలో మహిళలపై అఘాత్యాలు పెరిగిపోయాయి.

– గౌహతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

న్యూస్‌రీల్

శిశు మరణాల కట్టడికి చర్యలు



వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో శిశు మరణాల కట్టడికి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాల కట్టడికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ కేసులను గుర్తించి వారికి వైద్య సేవల్లో లోటు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఆర్బీఎస్‌కేకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన వాహనాన్ని పరిశీలించారు. బాలల భవిత కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే పిల్లలకు ఈ వాహనం ఉపయోగకరంగా ఉంటుందని, త్వరలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

14న గణపతి వ్రతం

కాణిపాకం : ఈనెల 14వ తేదీన కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకటహర గణపతి వ్రతం జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమవుతుందని, భక్తులు పాల్గొన్నవచ్చునని పేర్కొన్నారు.

రేపు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం తోటపాళ్యంలోని రాజామహల్ ఫంక్షన్ హాల్‌లో గురువారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరుగుతుందని అధ్యక్షురాలు రోజాప్రియ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎంపిక చేసిన నాలుగు ఉత్తమ నవలలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలతో సన్మానిస్తున్నామన్నారు.

డిప్యూటీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



వెంకట నారాయణ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా వెంకట నారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డిప్యూటీ సీఈఓగా ఉన్న జుబేదా కడప జిల్లాలోని డ్వామా శాఖ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తుడా కార్యదర్శిగా ఉన్న వెంకట నారాయణ బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఈఓ రవికుమార్ నాయుడును కలిశారు.

● పర్మిట్లకు పడిగాపులు



ఫీల్ ఫ్రెష్ ఫుడ్స్ ఫ్యాక్టరీ వద్ద పర్మిట్ల కోసం క్యూలో రైతులు

తవణంపల్లె : మండలంలోని మామిడి రైతులు జ్యూస్ ఫ్యాక్టరీల దగ్గర మామిడి కాయలు తరలించడానికి పర్మిట్ల కోసం పడిగాపులు పడుతున్నారు. మండలంలో ఐదు జ్యూస్ ఫ్యాక్టరీలు ఉండగా ఇప్పటి వరకు రెండు జ్యూస్ ఫ్యాక్టరీలు మాత్రం క్రషింగ్ ప్రారంభించారు. ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని బట్టి ఫ్యాక్టరీ యజమానులు రైతులకు పర్మిట్లు ఇచ్చి మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. తోతాపురి (బెంగుళూరు రకం) ఫ్యాక్టరీ యజమానులు కిలో రూ.6 ఇస్తామని అంటున్నారు. ప్రభుత్వం మాత్రం మామిడి రైతులకు రూ.4 ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొన్న మామిడి రైతులకు ప్రభుత్వం కిలోకు రూ.4 పరిహారం అందిస్తుంది. దీంతో రైతులు జ్యూస్ ఫ్యాక్టరీల దగ్గర మామిడి కాయలు తోలడానికి పర్మిట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు.

'తోతాపురి మామిడి మాకొద్దు'



ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడుతున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు

గుడిపాల : తోతాపురి మామిడి కాయలు తమకు వద్దని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం తెగేసి చెప్పింది. గుడిపాల మండలంలోని తాసా జ్యూస్ ఫ్యాక్టరీకి వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించి అధికారులను మంగళవారం నియమించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.8, ప్రభుత్వం రూ.4 మామిడికి ధర ఇవ్వనున్నట్లు నిర్ణయించారు. దీంతో అధికారులు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం అక్కడికి చేరుకొని ప్రస్తుతానికి తోతాపురి మామిడి కాయలు మాకొద్దని అధికారులకే తెగేసి చెప్పారు. తమిళనాడు నుంచి రూ.6 కే డెలివరీ చేస్తున్నారని ఇక్కడ మామిడి కాయలు ఇంకా పక్వానికి రాలేదని అధికారులకు వివరించారు. యాజమాన్యం మాత్రం ప్రస్తుతానికి మేము తీసుకోలేమని ఖరాఖండిగా చెప్పారు. దీంతో వ్యవసాయ, రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు చేసేదేమి లేక వెనుదిరిగారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రైతన్నలు ఫ్యాక్టరీ యాజమాన్య నిర్ణయాలపై మండిపడ్డారు.

ప్రైవేటు దోపిడీ



జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రతి తరగతిలోనూ టెక్నో, ఐఐటీ లాంటి పలు రకాల పేర్లతో అయోమయానికి గురిచేస్తూ అడ్డగోలుగా ఫీజుల దందా సాగిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే అడ్వాన్స్ బుకింగ్ పేరుతో రూ.లక్షలు దండుకుంటున్నారు. నెల రోజులుగా ఈ తతంగం నడుస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అడుగడుగునా ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై కూటమి ప్రభుత్వంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల దందా
- అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు
- పర్యవేక్షణలో విద్యాశాఖ విఫలం
- గగ్గోలు పెడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

● చిత్తూరు జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లి ఐటీఐ వద్ద అధికార పార్టీ మంత్రికి చెందిన పాఠశాలను నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ పాఠశాలలో బడులు పునఃప్రారంభం కాకముందే అడ్మిషన్ల వేట మొదలెట్టేశారు. కేజీ నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల పేరుతో దండుకుంటున్నారు. ముందస్తు అడ్మిషన్లు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కాలరాస్తున్నారు. అధికారంలో ఉన్నది మేమే...మమ్మల్ని అడిగే ధైర్యం ఎవరుకుంది అంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ తతంగంపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే విధంగా జిల్లాలోని పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి నియోజకవర్గాల్లో ఉన్న మరిన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అందిన కాడికి దోచుకుంటున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో ఇష్టానుసారంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ముందస్తుగా అడ్మిషన్లు పొందితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు కురిపిస్తున్నారు. తీరా అడ్మిషన్ చేసుకున్నాక ఫీజులు పెంచేసి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా మోసగిస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్ పేర్లతో సీట్ల దందాను కొనసాగిస్తున్నారు. ఏజెంట్లను నియమించుకుని అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. విద్యను వ్యాపారంగా మార్చేసి అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

నోరు మెదపని అధికారులు

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలలు నిర్వహిస్తున్న అడ్డగోలు అడ్మిషన్ల దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారులు అరికట్టాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీ పర్వం విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ నోరు మెదపడం లేదు. ఎంఈవోలు, డీవైఈవోలు తనిఖీలు చేయడం లేదు. ఆయా విద్యాసంస్థల నిర్వాహకులతో విద్యాశాఖ అధికారులు లాలూచి పడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముందస్తు అడ్మిషన్లు, అడ్డగోలు ఫీజుల వసూళ్ల పై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ఐదేళ్లల్లో అడ్డుకట్ట

ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల్లో జరుగుతున్న అడ్డగోలు వసూళ్లు, అక్రమాలను గత వైఎస్సార్‌సీపీ సర్కారు అడ్డుకట్ట వేసింది. ప్రత్యేకంగా ఫీజు నియంత్రణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్‌లో నిష్ణాతులైన విద్యావేత్తలను నియమించి క్షేత్రస్థాయి పర్యవేక్షణ ముమ్మరం చేసింది. కమిషన్ సభ్యులు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందగానే నేరుగా సంబంధిత కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టేవారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ సర్కారు ఐదేళ్ల పాలనలో కార్పొరేట్ పాఠశాలల అక్రమాలకు అడ్డుకట్ట పడింది.


జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు	158
ప్రాథమికోన్నత పాఠశాలలు	80
ఉన్నత పాఠశాలలు	170
మొత్తం పాఠశాలలు	408
ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు	15,250
ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు	30,040
ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు	11,922
ఉన్నత పాఠశాలల విద్యార్థులు	37,772
మొత్తం విద్యార్థులు	79,734
2025–26 విద్యాసంవత్సరంలో ముందస్తు అడ్మిషన్లు	22,458

ప్రత్యేక బ్యాచ్‌ల పేరుతో మోసం



కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో బ్రాంచ్‌లో ఒక్కో ధర ఉంటుంది. ఐఐటీ, టెక్నో, స్పార్క్ ఇలా పలు రకాల పేర్లతో అదనపు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సమయంలో ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించకూడదనే నిబంధన ఉంది. అయితే పలు పాఠశాలల్లో ముందస్తుగా ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించి అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నారు. విద్యార్థుల నైపుణ్యాల్లో తారతమ్యాలు సృష్టించి విద్యార్థులు మానసికంగా కుంగి పోయేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బ్యాచ్‌ల్లో భవిష్యత్తులో ఇంజినీర్, డాక్టర్లు అయ్యేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామంటూ ఇష్టానుసారం ఫీజులు దోపిడీ చేస్తున్నారు. 2025–26 వ విద్యాసంవత్సరం ఇంకా ప్రారంభం అవ్వకనే ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో అడ్మిషన్ల వేట నెల రోజుల ముందు నుంచే మొదలు పెట్టడంపై సర్వత్రా విమర్శలు గుప్పు మంటున్నాయి.

అధికారులకు ఫిర్యాదులు చేశాం



జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టారు. ఇష్టానుసారం ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలో జరుగుతున్న అధిక ఫీజుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధిక ఫీజులు, ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ వల్ల ప్రభుత్వ బడులను భవిష్యత్తులో మూసివేయాల్సిన పరిస్థితులు వస్తాయి. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తోంది.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిత్తూరు జిల్లా

కూటమి సేవలో పోలీసులు



వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

పలమనేరు : రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి నేతల కోసం పోలీసులు గట్టిగా అమలు చేస్తున్నారని మంగళవారం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. సాక్షి టీవీలో అమరావతి అంశంపై డిబేట్‌లో మాట్లాడిన వారిని కాదని అక్కడున్న జర్నలిస్ట్‌పై నిందలు మోపి అరెస్ట్ చేయడం గతంలో ఎప్పుడైనా జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కొన్ని ఛానెళ్ల మరీ ఘోరంగా మాట్లాడినా అప్పట్లో ఇలాంటి అక్రమ అరెస్టులు జరిగాయా అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు 147 హామీలను అమలు చేయాల్సిందిపోయి డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను ఏ మార్చడం కుదరదన్నారు. జర్నలిస్ట్ కొమ్మినేనిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడాన్ని సాక్షాత్తు న్యాయస్థానమే తప్పు బట్టిదంటే పోలీసులు ఎంత అత్యుత్సాహంతో రెడ్‌బుక్ కోసం పాటు పడుతున్నారో సామాన్య ప్రజలకు సైతం బాగా అర్థమవుతోందన్నారు.

చిత్తూరు డీఐజీకి ప్రత్యేక ఉద్యోగోన్నతి

చిత్తూరు కార్పొరేషన్ : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చిత్తూరు శాఖ డీఐజీ గిరిబాబుకు ప్రత్యేక ఉద్యోగోన్నతి పోస్టింగ్ (ఎస్‌పీపీ–1ఏ) కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. డీఐజీగా ఆయన 12 ఏళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక ఉద్యోగోన్నతి ఇచ్చింది.

క్లుప్తంగా

గుజ్జు పరిశ్రమల పరిశీలన

గుడిపాల : మామిడి గుజ్జు పరిశ్రమలకు మామిడి తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసుదన్‌రెడ్డితో కలిసి గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, టాసా గుజ్జు పరిశ్రమలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తోతాపురి రైతుకు కిలో రూ.12 ఇవ్వడం జరుగుతుందన్నారు. గుజ్జు పరిశ్రమ వారు రూ.8, ప్రభుత్వం నుంచి రూ.4 ఇస్తామన్నారు.

ఎరుకుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

చౌడేపల్లె : పుంగనూరు మండలం నక్కబండకు చెందిన ఎం.రామకృష్ణను ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకర్‌రావు నియామకపు ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మాలమహానాడు కా ర్యదర్శి ఎస్‌ఆర్.అశోక్, వివిధ సంఘం నేతలు స న్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎం.బాబు, జెవి.నాగరాజు, సుమిత్ర రమణ, మునికృష్ణ, శేషాద్రి, నరసింహులు, పార్వతమ్మ, రవణమ్మ, నాగరాజా, బాలు పాల్గొన్నారు.

200 మంది కార్యదర్శులు బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు జిల్లాలో పలు పంచాయతీల్లో పనిచేస్తున్న 200 మంది కార్యదర్శులను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. ఇందులో గ్రేడ్-1 కార్యదర్శులు 10 మంది, గ్రేడ్-2లో 31 మంది, గ్రేడ్-3లో 75 మంది, గ్రేడ్-4లో 84 మంది బదిలీలయ్యారని వివరించారు.

ఎస్సీలకు కూటమి ద్రోహం

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీలకు కూటమి ద్రోహం చేసిందని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు ధనరాజ్ విమర్శించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన రాష్ట్ర బడ్జెట్ కేవలం రూ.341 కోట్లే అన్నారు. లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ లో ప్రకటించిన పథకాలు ఎస్సీల జీవన విధానం, ఉపాధికి ఎటువంటి సంబంధం లేదని ఆరోపించారు. 2018-19 లో రూ.2450 కోట్లను కేటాయిస్తే ప్రస్తుతం రూ.341 కోట్లు కేటాయించడమంటే దళితులను మోసం చేయడమేనని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ అమలు చేస్తున్న 27 సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇచ్చి తప్పటమే అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.5 వేల కోట్లను బడ్జెట్‌ను ఎస్సీ కార్పొరేషన్‌కు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు వినోద్‌సాగర్, రూపేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు ఎస్జీటీలకు 351 నుంచి కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్జీటీలకు నేటి నుంచి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చిత్తూరు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీలు సీనియారిటీ జాబితా ప్రకారం సీరియల్ నం.351 నుంచి 700 వరకు ఉదయం 9.30 గంటలకు, సీరియల్ నం.701 నుంచి 1000 వరకు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్జీటీలు చిత్తూరు శర్మన్ పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని డీఈఓ కోరారు.

సర్వర్ పరేషన్

- పది రోజులుగా పనిచేయని సర్వర్
- రేషన్‌కార్డు దరఖాస్తుకు బ్రేకులు
- లక్షల్లో దరఖాస్తులు..అరకొరగా నమోదు
- విమర్శలతో కదిలిన ప్రభుత్వం
- దరఖాస్తుకు మళ్లీ అవకాశం



పనిచేయని సర్వర్



రేషన్‌కార్డు దరఖాస్తుకు వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

కాణిపాకం : కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజలను ఊరిస్తూ వస్తున్న కొత్త రేషన్ కార్డుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు చుక్కలు చూపుతున్నాయి. రేషన్ కార్డు దరఖాస్తు గడువు ఈనెల 9వ తేదీతో ముగిసింది. అయితే గడువును పెంచుతూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కానీ నేటికీ సాఫ్ట్‌వేర్‌లో నిబంధనలు మార్చకపోవడంతో లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణ ప్రాంతాల్లో సమస్య అధికంగా ఉంది. సాఫ్ట్‌వేర్‌లో నిబంధనలు సరళతరం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రేషన్ కార్డుల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేస్తోంది.అతికష్టం మీదుగా దరఖాస్తులకు అవకాశం ఇచ్చింది. ఇచ్చిన కొద్ది రోజులకే సర్వర్ డౌన్‌తో అగచాట్లు తప్పలేదు. మళ్లీ రేషన్‌కార్డు దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పొడిగించినా క్షేత్రస్థాయిలో సర్వర్ పనిచేయడం లేదు. దీంతో దరఖాస్తుదారులకు అవస్థలు తప్పడంలేదు. గత నెల వరకు రేషన్ కార్డుల వివిధ సమస్యల నిమిత్తం మొత్తం 39791 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్ కార్డులో చిరునామా మార్పునకు 841, ఆధార్ అనుసంధానం సరి చేసుకునేందుకు 532, షాపు రెన్యూవల్ 14, సభ్యుల చేర్పునకు 30464, సభ్యుల తొలగింపు 672, కొత్త రేషన్ కార్డుకు 3926, స్ప్లిట్ కార్డు దరఖాస్తుకు 3301, సరెండర్ రేషన్‌కార్డు 41 దాకా వచ్చాయి. అయితే దరఖాస్తు ప్రక్రియలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు సాఫ్ట్‌వేర్‌లో మార్చాల్సిన అవసరం ఉందని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సమస్యలు ఇవీ..

- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు ఉన్నప్పుడు కొడుకుకు పెళ్లయి కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే మొదట భార్య పేరును ఈ కార్డులోకి మార్పించుకోవాలి. తరువాత 21 రోజులకు కొడుకు, కోడలకు ప్రత్యేకంగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ వీరికి పిల్లలు పుడితే ఆ పిల్లలను వీరి కార్డులోకి ఎక్కించుకోవాలంటే మరో 21 రోజులు గడువు ఉంటుంది. ఈ విధంగా ఒక పేరు కార్డులో నమోదు కావాలంటే రోజుల తరబడి గడువు ఉంటే ఈ లోగా దరఖాస్తు గడువు ముగుస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు.
- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, కోడలు ఉంటే కూతురుకు పెళ్లయి వారికి వేరే కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నప్పుడు ఈ కార్డులో కార్డుదారుని కూతురు స్థానంలో కోడలు అని నమోదు అయినా, కోడలు స్థానంలో కూతురు అని నమోదైనా.. కార్డుదారుడికి సంబంధించి బంధుత్వంలో తేడాలు ఉంటే వారి పేరు తొలగించడానికి కుదరటం లేదు.
- ఒక కార్డులో తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, కోడలు ఉన్నప్పుడు ఉదాహరణకు రేషన్‌కార్డులో కార్డుదారుని కోడలుకు సంబంధించి కోడలు అని కాకుండా ఎస్‌పీ అని ఉంటే కోడలు పేరు కార్డులో నుంచి తొలగించలేకపోతున్నారు.
- భార్యాభర్తకు కొత్త రేషన్‌కార్డు కావాలన్నప్పుడు వారి ఆధార్ కార్డులో స్థానికంగా కాకుండా వేరే అడ్రసు ఉంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంతేకాక ఇంటి మ్యాపింగ్ జరగడం లేదని లబ్ధిదారులు వాపో తున్నారు. ఆధార్ కార్డులో చిరునామాలు సక్రమంగా ఉంటేనే ఇంటి మ్యాపింగ్ అవుతుందని, ఇంటి మ్యాపింగ్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కలుగుతుందని చెబుతున్నారు. ఆధార్‌లో చిరునామాల తేడా కారణంగా పాత కార్డు నుంచి వీరి పేర్లు తొలగించినా ఇంటి మ్యాపింగ్ కావడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.
- రేషన్‌కార్డు దరఖాస్తులో కరెంటు బిల్లు అధికంగా వచ్చినా కొత్త కార్డుకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ కరెంటు బిల్లులు తప్పులు వచ్చి విద్యుత్ శాఖ అధికారుల ద్వారా తప్పులు సరిచే సుకున్నా కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు నెలరోజుల సమయం పడుతుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రేషన్ కార్డు ఎవరిపేరు మీద ఉంటుందో ఆ కార్డుదారుడు మళ్లీ కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం లేదని అధికారులు చెప్తున్నారు.

వీఆర్‌ఓల అందుబాటులో లేకపోవడం

రేషన్ కార్డులు మంజూరులో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. చాలా మండలాల్లో రెండు నుంచి నాలుగు గ్రామాలకు ఒక రెవెన్యూ అధికారి ఉండటంతో అతని కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారి దరఖాస్తుపై సంతకం చేస్తేనే డిజిటల్ అసిస్టెంట్ దరఖాస్తు నమోదు చేయడానికి అవకాశం ఉంటుంది.

సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయకపోవడం

సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవానికి ఎటువంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాక కొత్త రేషన్‌కార్డుల నమోదుపై గ్రామ సచివాలయ అధికారులకు అవగాహన కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో చాలామంది దరఖాస్తు నమోదులో సమస్యలు తలెత్తినప్పుడు ఏం చేయాలో అర్థం కాక ఇతర అధికారులపై ఆధార పడాల్సి వస్తోంది.

రేషన్ కార్డు దరఖాస్తుకు గడువు లేదు..



సైట్‌లో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. అందుకే సర్వర్ డౌన్ అయింది. త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుంది. రేషన్ కార్డు దరఖాస్తుకు గడువు అనేది లేదు. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆందోళన వద్దు

– శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

అక్రమ గ్రా'నైట్'.. రైట్ రైట్

- పెద్దిశెట్టిపల్లిలో అక్రమ క్వారీ
- రోజుకు రూ.3 లక్షలు విలువ చేసే గ్రానైట్ తరలింపు
- యథేచ్ఛగా తమిళనాడుకు రవాణా
- అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు



అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లి అటవీ ప్రాంతంలో అక్రమ క్వారీ తవ్వకాలు జోరందుకున్నాయి. కూటమి నేతలు విలువైన గ్రానైట్‌ను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికారం మాదే..అడ్డుకునేది ఎవరంటూ..యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు చేపట్టారు. రెండు నెలలుగా ఈ తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో జోగుతూ...అక్రమ గ్రానైట్‌కు రైట్..రైట్ చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకూ రూ. 3 లక్షలు విలువ చేసే గ్రానైట్ బండలు యథేచ్ఛగా పెద్దిశెట్టిపల్లి నుంచి గుడిపాల మీదుగా తమిళనాడుకు తరలుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అనుమతి లేకుండా ఎలా క్వారీ తవ్వకాలు చేస్తున్నారని ప్రశ్నిస్తే..నోరు మెదపడం లేదని వారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

'ఈవీఎం'లపై బలపడుతున్న అనుమానాలు

- చిత్తూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు విషయంలో ఈవీఎంలలో జరిగిన అవకతవకలేనని మరోమారు స్పష్టమవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్న అంశాలు కూటమి ప్రభుత్వ గెలుపుపై అనుమానాలను వ్యక్తం చేస్తోందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అందరు అభ్యర్థులకు 1.45 లక్షల ఓట్లు పోలైతే.. 2019లో ఈ సంఖ్య 1.51 లక్షలుగా ఉందన్నారు. అంటే ఆరు వేల ఓట్లు పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తోందన్నారు. అలాగే 2024లో జరిగిన ఎన్నికల్లో మొత్తం పోలైన ఓట్లు ఏకంగా 1.67 లక్షలకు చేరుకోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రతి ఎన్నికల్లో సగటున 5 వేల ఓట్లు పెరిగితే.. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 16,200 ఓట్లు పెరగడం, అవే ఓట్లు ఇక్కడి కూటమి అభ్యర్థి గెలుపులో ప్రభావితం చూపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈవీఎంల పనితీరుపై ఉన్న అనుమానాలను ఇలాంటి గణాంకాలు ఇంకా బలపరుస్తున్నాయని విజయానందరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గెలుపొందిన చిత్తూరు ఎమ్మెల్యే.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, తన సొంత మేనిఫెస్టోలో ఒక్కటీ ఆచరణలోకి తీసుకురాలేదన్నారు. చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే న్యాక్ గుర్తింపు, యూనివర్సిటీ అప్‌గ్రేడ్ అయ్యాయనే విషయం ఎమ్మెల్యే గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇప్పుడు తానేదో కొత్త యూనివర్సిటీ తీసుకొచ్చినట్లు ప్రగల్భాలు పలికి, పీవీకేఎన్ కళాశాలను చూపిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు.

కల్లూరులో ఏనుగుల మంద

- భారీగా మామిడి పంటనష్టం
- మూడు రోజులుగా భయాందోళన
- తెల్లవారుజామున ఘాట్‌రోడ్డు దాటిన గజరాజులు

పులిచెర్ల(కల్లూరు) : మండలంలో ఎక్కడో ఒక చోట ఏనుగులు తిష్ట వేసి భారీగా పంట నష్టం చేయడం పరిపాటై పోయింది. ఇప్పటికే ఒకరు ఏనుగుల బారిన పడి మృత్యువాత పడ్డారు. దీంతో రైతులు పంట పొలాల వైపు వెళ్లడం మానేశారు. మరికొందరు పంట సాగు చేయడం మానేశారు. గ్రామస్తులు, ఫారెస్టు సిబ్బంది ఎన్ని విధాల ప్రయత్నించినా మండలం విడిచి వెళ్లడం లేదు. మండలంలో ఏనుగుల బాధ అధికంగా ఉండడంతో ఎవరూ పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. మూడు నెలల వరకు ఒంటరి ఏనుగు బెడద ఎక్కువగా ఉండేది.తరువాత ఈ మధ్య కాలంలో ఏనుగుల గుంపు ఎక్కువైంది. మూడు రోజులుగా కల్లూరు సమీపం ఎద్దులవారిపల్లె దాని సమీప అటవీ ప్రాంతంలో వీటి బెడద ఎక్కువైంది. మంగళవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు కల్లూరు ఘాట్ రోడ్డు దాటే సమయంలో ఆర్టీసీ బస్సు మరికొన్ని వాహనాలు ఆ మార్గంలో వెళ్తుండడంతో చూసి భయభ్రాంతులయ్యారు. అటవీ సిబ్బంది ఏనుగులు సంచరించే ప్రాంతంలోకి జనాలను ఎవరూ వెళ్లవద్దని చెబుతున్నారు. ఎప్పుడు ఎవరి మీద పడి దాడి చేస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

'అయ్యో'ర్ల పడిగాపులు

- రాత్రి 9.50 గంటలైనా ప్రారంభం కాని కౌన్సెలింగ్
- ఉదయం నుంచి ఎదురుచూస్తున్న టీచర్లు
- రాత్రి 9.20 గంటలకు సీనియారిటీ జాబితా విడుదల
- కౌన్సెలింగ్ కేంద్రంలోకి సంఘం నేతలకు నో ఎంట్రీ



కౌన్సెలింగ్ కేంద్రంలో చీకటిలో నిరీక్షిస్తున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల నుంచి విచ్చేసిన ఎస్జీటీలు బదిలీల కౌన్సెలింగ్ కోసం జిల్లా కేంద్రంలో పడిగాపులు కాశారు. రా త్రి 9.50 గంటల సమయం అయినప్పటికీ కౌన్సెలింగ్ ను విద్యాశాఖ అధికారులు ప్రారంభించలేదు. ఈ కౌ న్సెలింగ్‌కు హాజరైన ఎస్జీటీ టీచర్ల సీనియారిటీ ప్రకా రం బదిలీలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారు లు చర్యలు చేపట్టారు. పలు మండలాల నుంచి హాజరైన టీచర్లు కౌన్సెలింగ్ కేంద్రంలో చీకటిలో కూర్చుని రాత్రంతా నిరీక్షించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రాత్రి 9.20 గంటలకు ఎస్జీటీల సీనియారిటీ జాబితా ను విడుదల చేశారు. అయితే ఆ జాబితాలో సమగ్ర సీ నియారిటీ జాబితాను ప్రదర్శించాలని టీచర్లు డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు 350 వరకు మాత్ర మే జాబితాను విడుదల చేసి మిన్నకుండి పోవడంతో ఎస్జీటీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర సీనియారిటీ జాబితాను విడుదల చేస్తే బదిలీల్లో న్యాయం జరుగుతుందని పలువురు ఎస్జీటీలు వెల్లడించారు.

సంఘం నాయకులకు నో ఎంట్రీ

కౌన్సెలింగ్ నిర్వహించే సమయంలో టీచర్ల తరఫున సమస్యలను పరిష్కరించుకునేందుకు వివిధ సంఘాలు పాల్గొనడం ఆనవాయితీ. అయితే ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సంఘం నాయకులు హాల్‌లోకి రాకూడదని జిల్లా విద్యాశాఖ అధికారులు హుకుం జారీ చేశారు. ఎన్నడూ లేని వింత విధానాలను చిత్తూరు విద్యాశాఖ అధికారులు అమలు చేస్తున్నారని వివిధ సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం నాయకులు ఇతర జిల్లాల్లో విచారించగా సంఘం నాయకులను అనుమతిస్తున్నారని తెలిసింది. దీంతో ఆగ్రహానికి గురైన సంఘం నాయకులు ఉద్దేశపూర్వకంగా అనుమతించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

అలమటించిన అన్నదాత





టోకెన్ల కోసం ఫ్యాక్టరీ గేట్ల ముందు ఎదురు చూస్తున్న మామిడి రైతులు, దరఖాస్తులు తీసుకునేవారు లేక ఇలా..

- అవస్థలు పడిన మామిడి రైతులు
- పట్టించుకోని ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారులు
- టోకెన్ల కోసం తప్పని సిఫార్సులు



నేలపైనే నిరాశతో కూర్చున్న రైతులు

గంగాధర నెల్లూరు : మామిడిని రైతుల నుంచి కిలో రూ.12లకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు బేఖాతర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం జీడీనెల్లూరులోని జైన్ కంపెనీ ఎదుట మండుటెండలో కడుపు మాడ్చుకుని మామిడి పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి టోకెన్ కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారులు పట్టించుకోలేదని అన్నదాతలు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని వందలాది మంది మామిడి రైతులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. మొత్తం 1,100 మంది రైతులు పంట విక్రయానికి దరఖాస్తు చేసుకుంటే కేవలం 300 మందికి మాత్రమే టోకెన్లు మంజూరు మిగిలిన వారిని వెనక్కి పంపించేశారు. ట్రాక్టర్లలో మామిడి లోడ్‌తో వచ్చిన వారికి నిరాశే మిగిలింది. కొందరు సిఫార్సులతో టోకెన్ పొందారని, మండటెండలో ఎదురు చూసిన వారికి పక్కనపెట్టేశారని పలువురు ఆరోపించారు.



బార్లు తీరిన మామిడి కాయలతో ఉన్న ట్రాక్టర్లు

తోతాపురి కిలో రూ.ఐదే!

- కొనేలేమంటున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు
- అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- రూ.8కు కొనుగోలు చేయాలని అధికారుల ఆదేశం



చిత్తూరు మామిడి కాయల మార్కెట్‌లో కాయలను ప్యాకింగ్‌చేస్తున్న కూలీలు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : కూటమి ప్రభుత్వం తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించామని ఊదరగొడుతోంది. తోతాపురి కిలోల రూ.8కు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని గొప్పలు చెప్పుకుంది. అయితే ఆచరణలో తోతాపురి నిర్ణయ ధర అమలుకు నోచుకోవడం లేదు. రూ. 8కే కొనుగోలు చేయాలని అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ఫ్యాక్టరీలు తోతాపురి కిలో రూ. 8కే కొనుగోలు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వం కిలోకు రూ.4 ఇస్తామని వెల్లడించింది. దీంతో కూటమికి చెందిన రైతు నాయకులు సంబరపడిపోయారు. మంగళవారం తోతాపురి కిలో రూ.5కు కొనుగోలు చేయడంతో రైతులు మండిపడుతున్నారు. ఫ్యాక్టరీలు రూ. 5 కంటే ఎక్కువ కొనుగోలు చేయలేమని చేతులెత్తేస్తోంది. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి.

ఫ్యాక్టరీలు సిండికేట్?

జిల్లాలోని ఫ్యాక్టరీలు సిండికేట్ అయిందనే వాదనలు గట్టిగా వినిపిస్తోంది. దీంతో తోతాపురి కాయలను ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ, విద్యాశాఖ మంత్రుల దృష్టికి ఈ వారంలో తీసుకెళ్లేందుకు నిర్వాహకులు ఏకమయ్యారు.

మార్కెట్‌కు 300 టన్నుల కాయలు

చిత్తూరు నగరంలో మార్కెట్‌కు 300 టన్నుల మామిడి కాయలు వచ్చాయి. 200 బేనీషా రాగా మిగిలిన 100 టన్నులు వివిధ రకాల టేబుల్ రకాలు వచ్చినట్లు ట్రేడర్లు అంచనా వేశారు. అయితే బేనీషా ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. తోతాపురి (టేబుల్ రకం), చందూర, ఇమామ్ పసంద్, కాలేపాడు తదితర రకాల ధరలు సాధారణంగానే ఉన్నాయి.

మామిడి ధరలు ఇలా

రకం	కిలో ధర (రూ.లలో)	రకం	కిలో ధర (రూ.లలో)
తోతాపురి	5	అల్ఫోన్సో	20-25
బేనీషా	13-23	కాలేపాడు	20-40
మల్లిక	12-25	చందూర	5-13
తోతాపురి (టేబుల్‌రకం)	11-14	చక్కెర గుత్తి	60-70
		ఇమామ్ పసంద్	40-70